క్లుప్తంగా

దేశ ప్రగతికి పల్లెలే మూలం


మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ

బాడంగి: దేశ ప్రగతికి పల్లెలే మూలమని దీన్ని గుర్తించి ప్రజాప్రతినిధులు పల్లెల అభివృద్ధికి సహకరించాలని ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బందికి రెండు రోజులుగా ఇస్తున్న శిక్షణ శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరితో పాటు చదువుకున్న యువత సహకారం అవసరమన్నారు. రెండు రోజుల శిక్షణలో 17 రకాల లక్ష్యాలతో పాటు తొమ్మిది రకాల థీమ్స్‌పై టీఓటీల ద్వారా వివరించామన్నారు. శిక్షణలో వైస్ ఎంపీపీ భాస్కరరావు, మండల స్థాయి అధికారులు, కార్యదర్శులు, సర్పంచ్‌లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ


వాసవీక్లబ్ సభ్యులు అందించిన పుస్తకాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

రాజాం సిటీ: మండల పరిధి పొగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 30 మంది విద్యార్థులకు వాసవీ క్లబ్ మన రాజాం సారధి సభ్యులు పుస్తకాలు శుక్రవారం అందించారు. వాసవీక్లబ్ మనరాజాం – సారధి ఆధ్వర్యంలో ప్రారంభించిన అన్నదాన కార్యక్రమం 1000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని మోడల్ పేపర్లు అందించామని అధ్యక్షుడు ఉప్పల అంబరీస్ తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సత్యారావు, వాసవీక్లబ్ సభ్యులు డాక్టర్ గ్రంధి రవికుమార్, కంచర్ల శ్రీను, వాకచర్ల మన్మధరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో సచివాలయ ఉద్యోగుల నిరసన



కొప్పరవలసలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

వంగర: మండల పరిధి కొప్పరవలస సచివాలయంలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి శుక్రవారం విధులు నిర్వహించారు. సచివాలయ ఉద్యోగులపై మానసిక, భౌతికంగా దాడులకు నిరసనగా, ఇటీవల విశాఖపట్నం మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఓ నాయకుడు సచివాలయ ఉద్యోగులు మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడడం పట్ల నిరసన వ్యక్తం చేసినట్లు ఉద్యోగులు వెల్లడించారు.

ఉణుకూరులో వైద్య శిబిరం


వైద్య శిబిరంలో తనిఖీలు నిర్వహిస్తున్న డాక్టర్ రీనాచౌదరి

రేగిడి: మండలంలోని ఉణుకూరు గ్రామంలో బూరాడ పీహెచ్‌సీ వైద్యాధికారి రీనాచౌదరితో పాటు వైద్య సిబ్బంది వైద్యశిబిరం ఏర్పాటు చేసారు. శీతాకాలంలో ప్రజలు తీసుకోవల్సిన జాగ్రత్తలు వివరించారు. వృద్ధులు, చిన్నారులు, బాలింతలు చలికి దూరంగా ఉండాలని వెల్లడించారు. వైద్య శిబిరంలో 115 మందికి ఆరోగ్య తనిఖీలు చేసారు. కార్యక్రమంలో సర్పంచ్ గేదెల వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల ఆవరణలో కూరగాయల పెంపకం


కూరగాయల మొక్కలు పరిశీలిస్తున్న ఎంఈఓ దుర్గారావు

వంగర: పాఠశాలల ఆవరణలో ఖాళీ ప్రదేశాలుంటే కూరగాయలు పెంపకం చేపట్టాలని ఎంఈఓ వై.దుర్గారావు తెలిపారు. మండల పరిధి జేకేగుమ్మడ జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. పాఠశాల ఆవరణలో ఉన్న ఖాళీ ప్రదేశంలో వంగర, మునగ, చిక్కుడు వంటి మొక్కలు పెంపకం చేపట్టాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని, పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఆయన వెంట హెచ్‌ఎం, ఉపాధ్యాయులున్నారు.

గోతులతో సరి...

- కలగా రాజాం
- సంతకవిటి డబుల్ రోడ్డు నిర్మాణం
- ముందుకు కదలని సంతకవిటి
- పొందూరు రోడ్డు విస్తరణ
- ఎన్నికల హామీల్లో అధికార జాప్యం


గోతులు పూడ్చే కార్యక్రమంలో భాగంగా మెటల్ వేసి వదిలేసిన రాజాం - సంతకవిటి రోడ్డు

రాజాం: రాజాం నియోజకవర్గ కేంద్రం నుంచి వంగర, సంతకవిటి మండలాలకు రహదారుల విషయమై ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో కదలిక కనిపించడం లేదు. సార్వత్రిక ఎన్నికల ముందు అధికారంలోకి వచ్చిన వెంటనే రాజాం నుంచి అన్ని మండలాలకు డబల్ రోడ్డుల నిర్మాణంతో పాటు కొత్తగా రోడ్లు ప్రతీ గ్రామానికి నిర్మిస్తామని అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో పాటు ఆ పార్టీ నేతలు ప్రచారాల్లో హామీ ఇచ్చారు. ఇప్పుడు ఆ హామీలు అమలులో జాప్యం కనిపిస్తుంది. ఫలితంగా నియోజకవర్గ కేంద్రానికి వచ్చే సంతకవిటి, వంగర, రేగిడి మండలాల్లోని ప్రజలకు ప్రయాణ కష్టాలు తప్పడం లేదు.

ఈ రోడ్లకు మోక్షమెప్పుడో..

- రాజాం – సంతకవిటి డబుల్ రోడ్డు నిర్మాణం గత 14 ఏళ్లుగా నిలిచిపోయింది. 2009లో ఈ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పెట్టారు. 2010లో రూ.14 కోట్లు మంజూరీ చేసినట్లు అప్పటి ప్రజాప్రతినిధులు ప్రకటించారు. అనంతరం రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోగా, ఇంతవరకూ డబుల్ రోడ్డు నిర్మాణం జరగలేదు.
- సంతకవిటి – పొందూరు ప్రాంతాల మధ్య గతంలో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో డబుల్ రోడ్డు ప్రతిపాదన జరిగింది. అనంతరం ఆ ప్రతిపాదన నిలిచిపోయింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండడంతో ఈ రోడ్డు నిర్మాణం జరుగుతోందని అందరూ భావించారు. కానీ ఇంతవరకూ కదలిక మాత్రం లేదు.
- రాజాం నుంచి వంగరకు వెళ్లే రహదారిలో అరసాడ వరకూ మాత్రమే డబుల్ రోడ్డు ఉంది. అక్కడి నుంచి వంగర, కొత్తవలస తదితర ప్రాంతాలన్నీ ప్రమాదకర రోడ్లతో ఉన్నాయి. ఈ రోడ్డును డబుల్ రోడ్డు నిర్మాణం చేస్తామని సార్వత్రిక ఎన్నికల ముందు నేతలు హామీలు ఇచ్చారు.
- రాజాం నుంచి రేగిడి మండలానికి వయా గుళ్లసీతారాంపురం మీదుగా దగ్గర రహదారి ఉంది. ఈ రహదారి పూర్తిగా గోతులుగా మారింది. అంబఖండి, సోమరాజుపేట గ్రామాల వద్ద ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి. అధికారుల్లో మాత్రం చలనం కనిపించడం లేదు.
- రాజాం నుంచి వెళ్లే వంగర, సంతకవిటి, రేగిడి మండలాల్లోని పలు గ్రామాలకు ఇరుకు రోడ్లు, మలుపులు రోడ్లు ఉండడంతో ప్రమాదాలు తరచూ సంభవిస్తున్నాయి. దీంతో ప్రయాణికులు భయాందోళనలతో రాకపోకలు సాగిస్తున్నారు.


వంగర-కొత్తవలస గ్రామాల మధ్య రహదారి

డ్రైవింగ్ చాలా కష్టం

సంతకవిటి, రేగిడి మండలాల్లో రహదారి ప్రమాదకరంగా ఉంటుంది. ఈ రూట్‌లో ప్రైవేట్ వాహనాలు స్పీడు అధికంగా ఉంటుంది. దీంతో ఈ ప్రాంతాల్లో వాహన డ్రైవింగ్ చేయడం కష్టంగా ఉంటుంది.

– శింగంవలస గౌరీశంకర్, ట్రాక్టర్ డ్రైవర్, వన్నలి, రేగిడి మండలం

చాలా ప్రమాదం

రాజాం నుంచి వంగర, సంతకవిటి మండలాలకు డబుల్ రోడ్డు లేదు. పలుచోట్ల మలుపులతో రోడ్డు ప్రమాదకరంగా మారింది. రేగిడి మండలంలో కూడా మండల కేంద్రం నుంచి తునివాడ, ఇటు వన్నలి, కొమెర ప్రాంతాలకు రోడ్లు బాగోలేదు. ఈ రహదారుల్లో ప్రయాణాలు అంటే చాలా భయమేస్తోంది.

– కె.రామారావు, ఆటో డ్రైవర్, రాజాం

గోతులు కప్పడంతో అనుమానాలు

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం గుంతలు లేని రోడ్డు పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకంలో భాగంగా రాజాం నియోజకవర్గానికి రూ.4 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో పలుచోట్ల గోతులు పూడ్చి తారుతో కప్పుతున్నారు. దీంతో ఈ గోతులతోనే సరిపెడతారని, డబుల్ రోడ్లు, కొత్త రోడ్లు నిర్మాణం ఇప్పట్లో జరిగేట్టు లేదని అందరూ భావిస్తున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నిలబెట్టుకోవాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయంపై రాజాం ఆర్ అండ్‌బీ ఏఈ నాగభూషణ వద్ద ప్రస్తావించగా, డబుల్ రోడ్డు నిర్మాణాలకు కొలతలు సిద్ధం చేస్తున్నామని, త్వరలో కొత్త ప్రతిపాదనలు పెడతామని వెల్లడించారు. ప్రస్తుతం నిధుల కొరత కారణంగా ఎక్కడా గోతులు లేకుండా రోడ్లకు మరమ్మతులు జరుపుతున్నామని తెలిపారు.

సాక్షి రిపోర్టర్లపై దాడికి నిరసన


తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా నినాదాలు చేస్తున్న జర్నలిస్టులు

బొబ్బిలి: వైఎస్సార్ కడప జిల్లాలో సాక్షి రిపోర్టర్లపై దాడికి నిరసనగా బొబ్బిలిలో పలు జర్నలిస్టు సంఘాలు శుక్రవారం నిరసన తలపెట్టాయి. నల్లరిబ్బన్లు ధరించి పలు ప్రాంతాల నుంచి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్న జర్నలిస్టులు అక్కడ జర్నలిస్టులపై దాడిని ఖండిస్తూ నినాదాలు చేశారు. జర్నలిస్టులపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల ఐక్యత వర్ధిల్లాలని నినదించారు. ఇకపై ఏ ప్రాంతంలోనూ జర్నలిస్టులపై దాడులు చేయకుండా చట్టాలను కఠినంగా అమలు చేయాలని కోరుతూ డిప్యూటీ తహసీల్దార్ తొగురు సుబ్బారావుకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కందుల శ్రీనివాసరావు, ఏపీయూడబ్ల్యూజేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రేగులవలస వ్యాస్‌బాబు, చుక్క జగన్మోహనరావు, చంద్రశేఖర్, మహ్మద్ రఫీ, శంకరరావు, వెలమల తిరుమల వు, బంటు కృష్ణమూర్తి, వీఎస్ శర్మ, రేఖ తాడు, భాస్కరరావు, రాజ్‌కిరణ్, సింహాచలం, తెంటు రమేష్‌నాయుడు, పలువురు జర్నలిస్టు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడులు అరికట్టాలి


రాజాం తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న పాత్రికేయులు

రాజాం: మీడియా కవరేజీ నిమిత్తం వెళ్తున్న జర్నలిస్టులపై దాడులు వెంటనే అరికట్టేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ విజయనగరం జిల్లా సహాయ కార్యదర్శి ఉల్లాకుల నీలకంఠేశ్వర యాదవ్ డిమాండ్ చేసారు. వైఎస్సార్ కడప జిల్లా వేముల తహసీల్దార్ కార్యాలయం వద్ద నీటి సంఘాల ఎన్నికల కవరేజీ నిమిత్తం వెళ్లిన సాక్షి మీడియా ప్రతినిధులు శ్రీనివాస్, రాజారెడ్డి, కెమెరామెన్ రాములపై టీడీపీ అల్లరిమూకలు శుక్రవారం చేసిన దాడులను తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు రాజాంకు చెందిన పలువురు విలేకరులతో కలసి రాజాం తహసీల్దార్ కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. పత్రికా స్వేచ్ఛ వర్ధిల్లాలి, జర్నలిస్టులపై దాడులు అరికట్టాలి అంటూ నినాదాలు చేసారు. అనంతరం కడపలో జరిగిన జర్నలిస్టుల దాడులకు పాల్పడిన అల్లరి మూకలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్ ఎస్‌కే రాజుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రాజాంకు చెందిన పాత్రికేయులు వీవీ దుర్గారావు, జి.మన్మధకుమార్, సతీష్, వెంకటరావు, అన్నారావు, కల్లేపల్లి శ్రీనివాసరావు, టంకాల శ్రీనివాసరావు, రామారావు, తేగల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

బొబ్బిలి:

సెమీ క్రిస్మస్ సందర్భంగా స్థానిక యాదవ వీధిలోని బాలయేసు పుణ్యక్షేత్రం ఆవరణలో శుక్రవారం పేదలకు దుప్పట్లు, తువ్వాళ్లు పంపిణీ చేశారు. రెవరెండ్ ఫాదర్ మోహన్ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వితరణలో 350 మందికి రెవరెండ్ ఫాదర్ జీవన్‌బాబు చేతుల మీదుగా దుప్పట్లు, తువ్వాళ్లను అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌సీఎం చర్చి కౌన్సిల్ సభ్యులు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.


పేదలకు దుప్పట్లు, తువ్వాళ్లు అందజేత

ప్రారంభమైన మహా మంత్ర సప్తాహం



సంతకవిటి మండల కేంద్రంలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో మహామంత్ర సప్తాహం శుక్రవారం ప్రారంభమైంది. ఉదయం 7 గంటల నుంచి వారం రోజుల పాటు ఈ నెల 20వ తేదీ ఉదయం 7 గంటల వరకు మహా మంత్ర సప్తాహం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. హరే రామ, హరే కృష్ణ అనే మంత్రాన్ని భజన చేస్తున్నారు. చివరి రోజు ఈ నెల 20న మధ్యాహ్నం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు.

– సంతకవిటి

ధాన్యం కొనుగోలు పరిశీలన



రేగిడి మండలంలో ధాన్యం కొనుగోలును వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ శుక్రవారం పరిశీలించారు. నాయిరాలవలస గ్రామంలో ధాన్యం కొనుగోలును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 25 రైతు సేవా కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 7500 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసామని తెలిపారు. రైతులు దళారులకు ధాన్యం విక్రయించకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మండలంలో 16వేల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సి ఉందని వెల్లడించారు.

– రేగిడి

జాయింట్ ఎల్‌పీఎం సమస్యల పరిష్కారానికి చర్యలు


మాట్లాడుతున్న తహసీల్దార్ సులోచనరాణి

రామభద్రపురం: రీ సర్వేలో వచ్చిన జాయింట్ ఎల్‌పీఎం సమస్య పరిష్కారానికి సచివాలయం ద్వారా రూ.550లు చెల్లించి, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ సులోచనరాణి సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో రీసర్వే డీటీ ఉమాదేవితో కలిసి శుక్రవారం ఆమె మాట్లాడారు. మండలంలో నిర్వహించిన మొదటి దఫా రెవెన్యూ సదస్సులలో 2560 వినతులు వచ్చాయన్నారు. ఈ వినతులలో జాయింట్ ఎల్‌పీఎం సమస్యల పరిష్కారానికి 545 వినతులు వచ్చాయని తెలిపారు. పేరు తప్పుగా పడిన రైతులు కూడా రూ.50 చెల్లించి సచివాలయం ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విస్తీర్ణం వేరియేషన్ ఉన్నవి 63 దరఖాస్తులు రాగా మా పరిధిలోని సమస్యను పరిష్కరించి ఏడీ కార్యాలయనికి పంపించామన్నారు. సర్వే నంబర్లు తప్పులు పడినవి 189 వినతులు వచ్చాయని వాటిని జేసీ లాగిన్‌కు పంపించామని చెప్పారు. భూ వర్గీకరణ నిమిత్తం 67 వినతులు రాగా ఆర్డీఓ కార్యాయానికి పంపించామని అక్కడ పరిశీలన జరుగుతుందన్నారు. ప్రస్తుతం వెబ్‌సైట్ ఓపెన్ కాలేదన్నారు. సచివాలయంలో ఫీజు చెల్లించి ఆన్‌లైన్ దరఖాస్తున్న తదుపరి మాత్రమే సమస్య పరిష్కారమవుతుందని తెలిపారు. సచివాలయం ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తు రావాలి తప్ప సుమోటోగా చేసే హక్కు తమకు లేదని తెపారు.

11 కోట్లతో రోడ్లు, కాలువల నిర్మాణం


మండల ఇంజినీరు రాజశేఖర్

బొబ్బిలి రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో 114 రహదారులు, కాలువల నిర్మాణానికి రూ.8 కోట్లను ఖర్చు చేస్తున్నట్లు మండల ఇంజినీరు టి.రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఇప్పటివరకు 56 పనులు ప్రారంభించామని త్వరలో మిగిలిన పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. 11 కిలోమీటర్ల మేర రహదారులను, కాలువలను నిర్మించేందుకు ఈ నిధులను ఖర్చు చేస్తున్నామని చెప్పారు. సంక్రాంతి నాటికి పూర్తి స్థాయిలో నిర్మాణ పనులను పూర్తి చేయాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు. నిర్మాణాలు చేపడుతున్న కాంట్రాక్టర్లకు ముందుగా సగం మొత్తం చెల్లిస్తున్నామని, క్వాలిటీ కంట్రోల్ సిబ్బంది పరిశీలించి సంతృప్తికరమైన నివేదిక ఇస్తే మొత్తం బిల్లును కాంట్రాక్టర్‌కు చెల్లిస్తున్నామని తెలిపారు. నాణ్యత లోపిస్తే బిల్లులు నిలిపివేస్తున్నామని తెలియజేశారు. పై అంశాలను కాంట్రాక్టర్లకు ఎప్పటికప్పుడు చెబుతున్నామని, నాణ్యతలో రాజీ లేదన్నారు.

నీటి సంఘాల ఎన్నికలు కాదు.. నామినేటెడ్ ఎన్నికలు


గురుగుబెల్లి స్వామినాయుడు

రాజాం: ప్రస్తుతం జిల్లాలో జరుగుతున్న నీటి సంఘాల ఎన్నికలు టీడీపీకి చెందిన నామినేటెడ్ ఎంపికలు మాదిరిగా ఉన్నాయని కళింగ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గురుగుబెల్లి స్వామినాయుడు అన్నారు. రాజాంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద విలేకరులతో శుక్రవారం సమావేశంలో మాట్లాడారు. ఈ నీటి సంఘాల ఎన్నికలు పూర్తిగా చట్టవిరుద్ధంగా జరుగుతున్నాయని వెల్లడించారు. ఓటర్లకు ఇష్టం లేని, మెజార్టీ మద్దతు లేని టీసీల్లో కూడా టీడీపీ కార్యకర్తలకు పగ్గాలు ఇచ్చేందుకు అధికారులు రంగం సిద్ధం చేయడం, ఈ వ్యవహారానికి ఎన్నికలని పేరు పెట్టడం, అధికారులను నియమించడం హాస్యస్పదంగా ఉందని పేర్కొన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పకడ్బందీగా అన్ని ఎన్నికలు, ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించిందని, ప్రతీ ఒక్కరు ఆయా ఎన్నికల్లో ఓటు వేసుకునే అవకాశం వచ్చిందని గుర్తు చేసారు. ఇప్పుడు జరుగుతున్న ఎన్నికలను బర్త్‌రఫ్ చేసి, టీడీపీ తన కార్యకర్తలకు నామినేటెడ్ పదవులు మాదిరిగా ఇచ్చుకుంటే సరిపోయేదని, ఎన్నికల నిమిత్తం డబ్బు, సమయం ఆదా అయ్యేదని అన్నారు. తన బలాన్ని నిరూపించుకోవాలని ఉంటే ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని అన్నారు.

నీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు

రేగిడి: మండలంలోని పలుచోట్ల ఈ నెల 14న జరగనున్న నీటి సంఘాల ఎన్నికలకు శుక్రవారం ఏర్పాట్లు పూర్తి చేసారు. మండలంలో మడ్డువలస కాలువకు సంబంధించి నాలుగు, మైనర్ ఇరిగేషన్‌కు సంబంధించి 10 నీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయని ఎన్నికల అధికారి నాగేశ్వరరావు వెల్లడించారు. ఉదయం 8 గంటల నుంచి ఈ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం అవుతుందని అన్నారు.

కూటమి నేతలు మాటలే.. చేతల్లేవు...

బొబ్బిలి: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన కూటమి ప్రభుత్వం ఆరు నెలలు దాటినా హామీలు అమలు పర్చడం లేదు సరి కదా, కనీసం రోడ్డైనా మరమ్మతులు చేయించడం లేదని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మువ్వల శ్రీనివాసరావు విమర్శించారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. నియోజకవర్గ కేంద్రమైన బొబ్బిలిలోని రోడ్లు గతుకులమయమైనా పట్టించుకోవడం లేదన్నారు. ప్రయాణికులు నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మువ్వల శ్రీనివాసరావు అన్నారు.

ఏడు తులాల బంగారం చోరీ

రేగిడి: మండలంలోని ఉంగరాడమెట్ట వద్ద నివాసముంటున్న కరిమి పావనికి చెందిన ఏడు తులాల బంగారం ఈ నెల 12న అపహరణకు గురైనట్లు ఎస్సై పి.నీలావతి తెలిపారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదుచేసి, దర్యాప్తు ముమ్మరం చేశామని, 24 గంటలు దాటకముందే చోరీసొత్తును రికవరీచేశామని వెల్లడించారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరులకు వివరాలు వెల్లడించారు. పావని ఇంట్లోనే బంగారం చోరీకి గురికాగా, అన్నికోణాల్లో దర్యాప్తుచేయగా, ఇంటికి వచ్చిన బంధువులే తస్కరించినట్లు గుర్తించామ న్నారు. చోరీకి పాల్పడిన వ్యక్తిని అరెస్టుచేసి, రాజాం కోర్టుకు తరలించామని చెప్పారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

రాజాం సిటీ: అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ మూర్తి తెలిపారు. బొద్దాం గ్రామానికి చెందిన రూపేష్‌కుమార్ రాజాం నుంచి మద్యం బాటిళ్లను స్వగ్రామానికి శుక్రవారం తరలిస్తుండగా పెనుబాక గ్రామ సమీపంలో పట్టుకున్నామని చెప్పారు. ఈ మేరకు ఆయన నుంచి 20 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

పలు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు


బొబ్బిలి రూరల్: రైతు సమస్యలను తెలుసుకుంటున్న తహసీల్దార్ శ్రీను


రేగిడి : లింగాలవలసలో రెవెన్యూ సదస్సుకు హాజరైన రైతులు

బొబ్బిలి రూరల్: మండలంలోని మెట్టవలస గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సులో తహసీల్దార్ ఎం.శ్రీను పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఈ సదస్సులు ఎంతో దోహదపడతాయన్నారు. రైతులు తమ సమస్యలను అర్జీల రూపంలో వివరిస్తే వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. సరిహద్దు, విస్తీర్ణం సమస్యలను కొంత సమయం పడుతుందని రైతులు విన్నవించుకోగా వెబ్‌ల్యాండ్ తెరుచుకోలేదని, త్వరలో పేర్కొన్న సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ బదులిచ్చారు. అనంతరం రైతులు ఇచ్చిన అర్జీలను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ మాధవ, సర్వేయర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రేగిడిలో..

రేగిడి: రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కరిస్తున్నామని తహసీల్దార్ చిన్నారావు అన్నారు. మండలంలో పెద్దశిర్లాం, లింగాలవలస గ్రామాల్లో రైతు రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రీ సర్వే చేసిన భూముల్లో ఎటువంటి సమస్యలున్నా వాటిని పరిష్కారం దిశగా కృషి చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు గొర్జాన అప్పలనాయుడు, లెంక రాంబాబు, మాజీ సర్పంచ్ పాలవలస రామచంద్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి


శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎంపీడీఓ రవికుమార్

బొబ్బిలి రూరల్: గ్రామాల సర్వతోముఖాభివృద్ధి ప్రజాప్రతినిధులు, ప్రజలు, ప్రభుత్వ అధికార సిబ్బందితోనే సాధ్యపడుతుందని ఎంపీడీఓ పప్పు రవికుమార్ అన్నారు. తన కార్యాలయంలో శుక్రవారం జరిగిన సుస్థిర గ్రామాభివృద్ధి లక్ష్యాలపై జరుగుతున్న శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పరిపాలకులు, ప్రభుత్వ అధికార సిబ్బంది పరస్పర సహకారంతోనే గ్రామాలు అభివృద్ధిలోకి వస్తాయన్నారు. ప్రజలకు మంచి చేయాలనుకున్న పాలకులకు తోడుగా ఉండాలని, నూతన సాంకేతిక విలువలను జోడించి ప్రజలకు సేవ చేయాలని సూచించారు. మౌలిక సదుపాయాల కల్పనతో ప్రజలకు చేరువ కావాలని గ్రామాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ అల్లు భాస్కరరా తదితరులు పాల్గొన్నారు.